క్లుప్తంగా

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వీరారెడ్డి



ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా కుర్ర వీరారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. విద్యార్థి దశలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)లో క్రియాశీలకంగా పనిచేశారు. ఆ తరువాత యువజన సమాఖ్య పనిచేసిన ఆయన సిపిఐ కొండపి ఏరియా కార్యదర్శిగా నిరంతరం ఉద్యమాల్లో పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా ఎంపికైన వీరారెడ్డిని పలువురు అభినందించారు.

విద్యాదీవెనతో విద్యార్థులకు ఆర్థిక భరోసా

గిద్దలూరు రూరల్: జగనన్న విద్యాదీవెనతో విద్యార్థుల భవిష్యత్ ఆర్థిక భరోసా లభిస్తుందని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని విద్యార్థులకు నాలుగో విడత నిధులకు చెందిన చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను సాధించాలని ఆమె కోరారు. నియోజకవర్గంలోని 5575 మంది విద్యార్థులకు రూ.3.51,06,847 విడుదల చేయనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి షేక్ జబ్బార్ తెలిపారు. మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వార్డెన్లు బాబూరావు, ప్రభాకర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, అంజిరెడ్డి, రోజా పాల్గొన్నారు.

ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ

దొనకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. సుమారు 500 చెత్త బుట్టలు వలంటీర్ల ద్వారా పంపిణీ చేశారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి తెలిపారు. వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గిద్దలూరు రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్థానిక ఎస్ఐ వి.మహేష్ మండలంలోని రౌడీషీటర్లకు శుక్రవారం పోలీసుస్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజాజీవన విధానానికి ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడటంతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల జాబితాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ సక్రమ జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్త పడాలన్నారు.

32 మద్యం బాటిళ్ల స్వాధీనం

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి వేణుగోపాలరావు నుంచి 32 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. వేణుగోపాలరావు ఇంట్లో అక్రమంగా మద్యం ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో అతని వద్ద నుంచి 32 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకి హాజరు పరచనున్నట్లు ఏఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

'చెకుముకి'లో అరవింద పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో మార్కాపురం పట్టణంలోని అరవింద పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం పొందినట్లు కరస్పాండెంట్ సి.వాణి రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. వై.దినేష్, ఎస్.నాగచైతన్య, కె.అలేఖ్యలు బహుమతులు పొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.

ఎస్ఐగా ఎంపికైన వాసవి కళాశాల విద్యార్థి

కంభం: పట్టణంలోని వాసవీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న అర్ధవీడు మండలం గన్నెపల్లెకు చెందిన షేక్ ఖాశింవలి ఈ నెల 22వ తేదీన వెలువడిన ఎస్ఐ పోటీ పరీక్షల్లో 243 మార్కులు సాధించి ఎస్ఐగా ఎంపికయ్యాడు. ఖాశింవలిని వాసవీ డిగ్రీ కళాశాల అధినేత గోళ్ల సుబ్బరత్నం శుక్రవారం ఘనంగా సత్కరించాడు. తమ కళాశాలలో చదివి మంచి స్థాయిలో నిలిచినందుకు అతడిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ కూన రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

అర్ధవీడు (కంభం): ఆటోను తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలం గట్టుపైకి వెళ్లిపోయిన ఘటన శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కంభం నుంచి అర్ధవీడు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మోహిద్దీన్‌పురం మూలమలుపు వద్ద ఎదురుగా ఉన్న ఆటోను తప్పించబోయి గట్టుపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. జేసీబీ సాయంతో బస్సును వెనక్కి లాగారు.

పారిశుద్ధ్య పనులు ఆగకూడదు

- సమ్మె బాటలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు
- రెగ్యులర్ కార్మికులతో పాటు అదనపు సిబ్బందితో పనులు
- పరిస్థితిపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని ఆరా



పాత మార్కెట్ సమీపంలో పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో ఎలాంటి పరిస్థితుల్లో పారిశుద్ధ్య పనులు ఆగకూడదని పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. రెండు విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ శుక్రవారం ఒంగోలు నగరంలో పర్యటించారు. నగర పాలక సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నతాధికారులు కార్మిక సంఘాల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. అయితే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ పర్మినెంట్ కార్మికులతో పనులు చేపట్టామన్నారు. అదేవిధంగా ఇంజినీరింగ్ విభాగంలోని సిబ్బందిని కూడా కార్యక్రమాలకు వాడుతున్నామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె బాట పట్టిన అంశాన్ని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రస్తావించారన్నారు. ఆయన ఫోన్ చేసి తనతో మాట్లాడారని, కార్మికులు సమ్మె చేస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ పారిశుద్ధ్య పనులకు ఎలాంటి ఆటంకాలు జరుగకూడదని ఆదేశించారని చెప్పారు. సిబ్బందిని రాత్రి వేళల్లో కూడా పనిచేయించి చెత్త సేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారని కూడా చెప్పారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని చెప్పారని వివరించారు. నగరంలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును ఎమ్మెల్యే బాలినేనికి వివరించానన్నారు. నగరంలోని సీతారాంపురం, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఏరియా, కొప్పోలు రోడ్డు, బైపాస్ రోడ్డు, కర్నూలు రోడ్డు, గాంధీ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ తీరును పరిశీలించి వారిని ప్రోత్సహించారు. సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పనులు చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్ వైజర్ ఎస్.పిచ్చయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్, సచివాలయ సిబ్బంది కూడా పాల్గొన్నారు.



గరుడ ఉత్సవంలో పాల్గొన్న శిద్దా రాఘవరావు, ఆలయ పాలక మండలి సభ్యులు

చెన్నకేశవ స్వామికి పట్టు వస్త్రాలు

- సమర్పించిన శిద్దా రాఘవరావు

ఒంగోలు మెట్రో: స్థానిక ప్రసన్న చెన్న కేశవ స్వామి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి రాష్ట్ర మాజీ మంత్రి శిద్దాద్దా రాఘవరావు ప్రసన్న చెన్నకేశవ స్వామి గరుడ ఉత్సవం పాల్గొని స్వామి దర్శనం చేసుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం శిద్దా రాఘవరావు క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి, లక్ష్మీ చెన్న కేశవ స్వామి, రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివార్లను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చక స్వాములు చేత వేద ఆశీర్వచనం తీసుకున్నారు. ముందుగా ఆలయ పాలక మండలి చైర్మన్ ఈదుపల్లి గుర్నాథం, కార్యనిర్వాహణాధికారి రజని కుమారి ఆలయ అర్చకులు స్వాములు శిద్దా రాఘవరావును పూర్ణకుంభంతో వేదమంత్రాలతో స్వాగతం పలికి స్వామి వారి చిత్ర పటం బహూకరించారు. ఆలయ పాలకమండలి సభ్యులు కుర్రా ప్రసాద్, నెమ్మాని హరిప్రియ దేవి, రావిపూడి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర



ఇనమనమెళ్లూరులో ఖోఖో ఆడుతున్న బాలికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్ కోడూరి గోపి

మద్దిపాడు: మండలంలోని సచివాలయాల పరిధిలో యువకులు ఆడుతూ పాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారు. శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఖోఖో పోటీలు నిర్వహించగా పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇనమనమెళ్లూరులో 15 సంవత్సరాలు దాటిన బాలబాలికలు ఉత్సాహంగా ఖోఖో పోటీలో పాల్గొన్నారు. పాఠశాల పీడీ అప్పారావు, నైనాల శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోటుమాల (కొత్తపట్నం): పల్లె ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకరావడానికే ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మోటుమాల గ్రౌండ్‌లో క్రికెట్‌ను గోపి చేతులతో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో క్రీడాకారులు పల్లెలకే పరిమితం అవుతారని ఇటువంటి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర, జాతీయ, అంతార్జాతీయ స్థాయికి వెళ్లే అవకాశం ఉందన్నారు. గుండమాల, మోటుమాల గ్రామ సచివాలయ పరిధిలో జరిగాయి. గుండమాల సర్పంచ్ కారాని జయరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, లావణ్య, సచివాలయ కన్వీనర్ కోడూరి వెంకటరెడ్డి, సీహెచ్ బ్రహ్మయ్య, శివకృష్ణ, పురిణ బ్రహ్మరెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా పేస్



పేస్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు

ఒంగోలు: జిల్లా స్థాయి అంతర పాలిటెక్నిక్ కాలేజీ క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌గా పేస్ పాలిటెక్నిక్ కాలేజీ నిలిచిందని పేస్ విద్యా సంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అన్నారు. ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు జిల్లాస్థాయి 26వ అంతర పాలిటెక్నిక్ కాలేజీ క్రీడా పోటీలు కందుకూరు, ఈతముక్కల ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో జరిగాయన్నారు. వీటిలో వివిధ పాలిటెక్నిక్ కాలేజీల నుంచి 800 మంది పాల్గొన్నారన్నారు. వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం, కబడ్డీ, చెస్, టేబుల్ టెన్నిస్‌లో ద్వితీయ, అథ్లెటిక్స్‌లోని రన్నింగ్, జావెలిన్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. దీంతో పేస్ కాలేజీకి జిల్లా స్థాయి పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ లభించిందని పేర్కొంటూ విద్యార్థులను అభినందించారు. 2024 జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు అనంతపురంలో జరిగే 26వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో వీరు పాల్గొంటారని, అక్కడ కూడా విజయం సాధించాలన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, సీఏఓ ఎం.రమణబాబు పాల్గొన్నారు.

రసాయనాలు లేని సమాజంగా తీర్చిదిద్దాలి



అవగాహన కల్పిస్తున్న సుభాషిణి

కొత్తపట్నం: పురుగు మందు అవశేషాల లేని సమాజంగా తీర్చిదిద్దాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి అన్నారు. వెలుగు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ పురుగు మందులు అవశేషాలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన కలిగే అనార్థాలు గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేయాలని డ్వాక్రా గ్రూపు సభ్యులను ఆదేశించారు. గ్రామ సంఘం సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని కోరారు. కొత్తపట్నం గ్రామంలోని కొత్తపట్నం గ్రామ సంఘం-6లో పట్టపు సురేష్, పట్టపు ప్రవీణ్ కుమార్ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం వరి పొలాన్ని మండల సమాఖ్య ప్రతినిధులు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పైరును వివరించారు. ఏపీఎం షేక్ రజియా సుల్తాన్ బేగం, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది నరసింహులు, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

పొగాకులో మల్లె నివారించుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు

ఒంగోలు సెంట్రల్: దక్షణ ప్రాంత నల్లరేగడి, తేలిక నేలల్లో అక్కడక్కడ మల్లె విస్తరించే ఉన్నదని రైతులు కొన్ని పద్ధతులు అవలంబించటం వలన నివారించవచ్చని ఒంగోలు ప్రాంతీయ బోర్డు అధికారి ఎం. లక్ష్మణరావు అన్నారు. బోర్డు పరధిలో శుక్రవారం పలు తోటలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. పొగాకు మల్లె పరాన్నజీవి కులపు మొక్క అని, పొగాకు వేరు నుంచి పోషకాలను తీసుకుని పొగ మొక్కను క్షీణింప చేస్తుందని చెప్పారు. కొండపి వేలం నిర్వాహణాధికారి జి. సునీల్ కుమార్, ఎస్‌జీఓ సాయి కుమార్ పాల్గొన్నారు.

పొగాకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి నాణ్యత వస్తుందని పొగాకు బోర్డు ఒంగోలు-2 వేలం నిర్వాహణాధికారి కోవి రామక్రిష్ణ తెలిపారు. ఎన్‌జీ పాడు మండలం మాచవరం గ్రామంలో పొగాకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పురుగు మందు అవశేషాలు, అన్యపదార్థాలు వలన కలిగే ప్రతికూల పరిస్థితులపై అవగాహన కల్పించారు. తలలు తుంచుట, పిలకల నివారించుట వలన కలిగే ఉపయోగాలను, నీటి తడుల యాజమాన్యంపై, పంట నియంత్రణపై పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఐటీసీ మెనేజర్ యశ్వంత్ కుమార్, ఎఫ్ఓ రామాంజనేయులు, బోర్డు సిబ్బంది, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

సాగర్ నీరిచ్చి రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

చీమకుర్తి: పొగాకు సాగుకు ఒక తడి సాగర్ నీళ్చిచ్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రబీసీజన్లో సాగు చేసిన పొగాకుకు సకాలంలో వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సాగు నీరు లేకపోవడం వలన పొగాకు పెరుగుదలపై దాని ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటికే ఖరీఫ్‌లో వర్షాలు లేక సాగు చేసిన పంటలతో రైతులు నష్టపోతున్నారని, పొగాకు రైతులు నష్టపోకుండా ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులు సక్రమంగా ఖర్చు చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: కేంద్రం పంచాయతీలకు ఇస్తున్న నిధులను సక్రమంగా ఆయా శాఖల అధికారులు స్థానిక నాయకులతో సంప్రదించి ఖర్చు చేయాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం ఘడియపూడి పునరావసకాలనీ, మద్దిపాడు సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం మాట్లాడారు. అవసరమైన పనులు గుర్తించి నిధులు ఖర్చు చేయాలని మండల అధికారులకు సూచించారు. గ్రామ సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ 15 ఆర్థిక సంఘ నిధులు విడతలుగా కాకుండా ఒకే సారి పంచాయతీలకు జమ చేయాలని తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ వెంకట స్వామి, వ్యవసాయ శాఖ ఏడీఏ ప్రభాకర్ మండల స్థాయి అధికారులు ఎంపీటీసీ ప్రభాకర్, మజీద్, రమణ, కనపర్తి వెంకట్రావు, చరణం సురేష్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీపీఓ నారాయణరెడ్డి

ఒంగోలు సిటీ: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడమే ప్రధానమని, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జి.వి. నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారు చేయడం కోసం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను నిబంధనలకు లోబడి పక్కాగా తయారు చేయాలన్నారు. ప్రణాళికలో సూచించిన పనులకు నిధులు కేటాయించలేమన్నారు. ప్రతి ఒక్కరూ ఫంక్షనల్ కమిటీలను ఏర్పాటు చేసి పద్ధతి ప్రకారం ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించారు. భారతప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాలను పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామం, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలల స్నేహపూర్వక గ్రామం, నీటి సమృద్ధి కలిగిన గ్రామం వంటి లక్ష్యసాధన కోసం సంకల్పం తీసుకోవాలన్నారు. ఆర్థిక సంఘం నిధులను ఖర్చు పెట్టాలంటే తగిన పనులు ముందుగా నిర్ధారించుకొని, ఆమోదం పొందిన వివరాలను ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామసభ నిర్వహణలో మూడు విధాలైన గ్రామ సభలను క్రమపద్ధతిలో నిర్వహించాలన్నారు.

అన్ని పంచాయతీల్లో..

మొదటి గ్రామ సభ 2024 జనవరి 2,3 తేదీల్లో నిర్వహించాలి. తదుపరి నోడల్ అధికారులు ఫెసిలిటేటర్స్ ఫ్రంట్ లైన్ వర్కర్సు వివరాలను, పంచాయతీ ప్రొఫైల్ ఇ- గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో అప్డేట్ చేయడం.

- 2024 జనవరి 9 నుంచి 10 వరకు ఎంపీడీఓలకు, విస్తరణాధికారులు, అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులకు శిక్షణ.
- జనవరి 12 నుంచి 18 వరకు అందరూ పంచాయతీ కార్యదర్శులకు ఫ్రంట్ లైన్ వర్కర్స్, సర్పంచ్ ఫంక్షనల్ కమిటీలు మండల స్థాయిలో రెండు రోజుల శిక్షణ
- జనవరి 17 నుంచి 24 వరకు పంచాయతీ స్థాయిలో ముసాయిదా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ.
- జనవరి 25 నుంచి 27 వరకు జీపీడీపీ(2024-25) ఆమోదానికి అన్ని గ్రామ పంచాయతీల్లో రెండో గ్రామ సభ జరపడం.
- 27 నుంచి 28 వరకు మండల స్థాయి టీంచే జీపీడీపీ 2024 స్క్రూటినీ.
- జనవరి 28 నుంచి 31 వరకు గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా ఆమోదం అప్లోడ్ చేయటం.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ అనంత మల్లిఖార్జునరావు

ఒంగోలు: ఆదరణకు నోచుకోక వీధి నిరాశ్రయులుగా మిగిలి, చలికి గజగజ వణుకుతున్న వృద్ధులకు మాజీ కౌన్సిలర్ అనంత మల్లిఖార్జునరావు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంత మల్లిఖార్జునరావు మాట్లాడుతూ సాయిబాబా గుడి, ట్రంకురోడ్డు, శివాలయం సెంటర్, మస్తాన్‌దర్గా సెంటర్, బస్టాండు సెంటర్, చర్చి సెంటర్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించి 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. ముస్లిం నాయకులు షేక్ అన్వర్ బాషా, అనంత రవితేజ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్

దర్శి: నాణ్యమైన విత్తనాలకే ప్రాధాన్యం ఇచ్చి రైతులకు మేలు కలిగేలా విక్రయాలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు, రైతు ఉత్పత్తి దారుల కంపెనీలకు, సీఈఓలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌లకు, రైతులకు ఎన్ఎస్‌సీ ద్వారా విత్తనోత్పత్తి, విత్తన విక్రయంపై అవగాహన, శిక్షణ సదస్సు దర్శి కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎస్‌సీ ద్వారా విత్తనోత్పత్తి చేపట్టడం రైతులకు ఎఫ్‌పీఓ, ఇతరులకు లాభదాయకమన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతుల దరిచేర్చి వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ విత్తన చట్టాలు విత్తన విక్రయానికి సంబంధించిన లైసెన్స్ వివరాల గురించి తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విత్తనోత్పత్తి వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషా మాట్లాడుతూ కోత అనంతరం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు వాటి నియమాల గురించి వివరించారు. ఎన్ఎస్‌సీ ఏరియా మేనేజర్ జగదీష్, ప్రొడక్షన్ అధికారులు వైడీ శ్రీనివాస్, శ్రీరాంప్రభు పాల్గొన్నారు.

తలసేమియా బాలుడికి రక్తదానం



బాలుడికి రక్తదానం చేసిన థామస్

ఒంగోలు టౌన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఒక బాలుడికి రక్తదానం చేశారు ఎంఎంఆర్ ఫౌండేషన్ అధినేత మక్కెన థామస్. ఒంగోలులోని జీజీహెచ్‌లో ఒక చిన్నారి బాలుడు తలసేమియాతో చికిత్స పొందుతున్నాడు. అతడికి రక్తం అవసరం ఉందని తెలిసిన మక్కెన థామస్ వెంటనే స్పందించారు. శుక్రవారం జీజీహెచ్‌కు వెళ్లిన ఆయన స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను ఇప్పటి వరకు 69 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం పట్ల సరియైన అవగాహన లేకపోవడంతో చాలా మంది చేయడం లేదన్నారు. దీని వలన అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరకక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అదనపు కట్నం కోసం వేధించిన కేసులో జైలు శిక్ష

ఒంగోలు టౌన్: అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే కాకుండా ఆమె మృతికి కారకులైన ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అదనపు జిల్లా జడ్జి తీర్పు ఇచ్చారు. గుట్లూరు గ్రామానికి చెందిన మొగిలిశెట్టి వేణుగోపాల్ ఒక బట్టల దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. తన చెల్లెలు రేణుకను అదే మండలంలోని చిమిడిపాడు గ్రామానికి చెందిన జలగం మహేంద్రకు ఇచ్చి వివాహం జరిపించారు. కట్న కానుకల కింద 1.20 లక్షల రుపాయల కట్నం, 15 సవర్ల బంగారం ఇచ్చారు. అయితే రెండు సంవత్సరాల పాటు కాపురం సజావుగా సాగింది. వారికి అబ్బాయి పుట్టాడు. అతరువాత అదనపు కట్నం తీసుకొని రావాలని అత్తమామలతో కలిసి భర్త వేధించడం మొదలు పెట్టారు. వేధింపులు తట్టుకోలేక 2012 ఆగస్టులో రేణుక బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఏ.వెంకటాద్రి కేసు నమోదు చేశారు. డీఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ అక్కేశ్వరరావు దర్యాప్తు చేసి నిందితులు జలగం మహేంద్ర, జలగం మాలకొండయ్య, జలగం సావిత్రిలను అరెస్టు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ఒంగోలు రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణ జరిపి నేరం నిర్ధారణ కావడంతో నిందితులకు 7 ఏళ్లు జైలు శిక్ష, 9 వేల రుపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ తీర్పు వెలువరించారు. కట్నం సొమ్ము 1.20 లక్షల రుపాయలతో పాటు 9 వేల రూపాయలు జరిమానా కలిపి మొత్తం సొమ్మును మృతురాలి కుమారుడికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున యత్తపు కొండారెడ్డి వాదించారు.